# పక్కింటిగౌరి

శ్రీ గోవిందరాజు శ్రీనివాసమూర్తి

తనకు అరవై యేళ్ళు నిండాయని రిటైరైన రోజున తెలిసింది ముకుందరావుకు. ఈ అరవై యేళ్ళజీవితంలోనూ "ఫలానారోజు నీ పుట్టినరోజు" అని గుర్తు చేసినవాళ్ళు ఎవరూ లేరు. ఆయన పెళ్ళి చేసుకోలేదు. "ఎందుకు చేసుకోలేదు?" అని ఆయనను ఎవరైనా ప్రశ్నిస్తే చిరునవ్వుతో "పిల్లనిచ్చేవాడు కనుపించలేదు" అని జవాబిస్తాడు. ఆ చిరునవ్వు వెనకాల ఒక విషాదం ఉంది. వారాలు చేసి చదువుకుని లా పరీక్ష ప్యాసయిన రోజున ముందుముందు జడ్జి అవుతావని చిన్న అనుమానం కలిగినా పెళ్ళిచేసుకుని ఉండునేమో! వారాల చదువు వాడికి పిల్లనిచ్చినవాడు కనుపించలేదు ఆనాడు. జడ్జి అయిన తర్వాత ఒక్కొక్కప్పుడు ఆయనలో ఆ కుతూహలం కలిగినా, తన వయస్సు గుర్తుకువచ్చి సిగ్గేసేది. "వెర్రి ఆలోచనలు!" అనిపించేది.

ఏమైతేనేం ముకుందరావు జీవితమంతా బ్రహ్మచారిగానే గడిపేశాడు. ఇంకా ఏంచూసుకొని బతకాలనో, జీవితమంటే యావ చావలేదు. రిటైరుకాగానే ఆయన చేసిన మొదటిపని, ఊరిచివరగావున్న నరసింమూర్తిగారి మేడ కొనటం. ఈ మేడ కొనేందుకు రెండు కారణాలున్నాయి. ఒకటి : ఊరికి దూరంగా ఉండడం, ప్రకృతీ, మేఘాలూ, చంద్రుడూ, వెన్నెలా గట్రా విచ్చల విడిగా అనుభవించాలన్న దురాశ. రెండు: నరసింమూర్తిగారి మనమరాలి పొరుగుగా ఉండవచ్చన్న ఆశ. డెబ్బై ఏవేలూ ఇచ్చేసి ఇల్లు తనపేర రిజిష్టరు చేయించుకున్నాడు ముకుందరావు.

డెబ్బైవేల ఇంటినీ ఖాళీగా ఉంచితే బోసి కొడుతుందని కుర్చీలూ, టేబుళ్ళూ, సోఫాలూ పుష్కలంగా సరఫరా చేయించాడు ఇంటికి. అందంగా అలంకరించేందుకు నరసింమూర్తిగారి మనమరాలి సాయం కోరుదామనుకున్నాడు కాని, ఆరోజు ఆమె ఊళ్ళో లేదు. మొగుడూ పిల్లల్తో కలిసి ఢిల్లీ వెళ్ళిందట. మరోవారం రోజులకు గాని రాదట. పిల్లలనేప్పటికి గుండె గుభిల్లుమంది ముకుందరావుకు. ఆయన ఈ అరవై యేళ్ళలోనూ దేన్నైనా అసహ్యించు కున్నాడంటే—అది ఈ "క్రరు కుంకలే". ఒకరోజు ఒకస్నేహితుడి ఇంటికి వెళ్ళి ఆయనతో మాట్లాడుతున్నాడో లేదో "ఓ కుర్రవెధవ" టమటమాల బండి తనముందు నుంచి ఈడ్చు కెళ్ళాడు. "బాబూ, ఆపరా నాయనా" అంటే విన్నాడుకాదు. "వెధవా, ఆపు" అంటే మరీ టమటమ అనిపించాడు. ఆయనకు విసుగెత్తి ఆబండీ తీపి కిటికీలోంచి అవతల పారేశాడు. ఆస్నేహితుడు ఏం బిక్క మొహం వేశాడోననికూడ చూడకుండా ఇంటికి తిరిగివచ్చేశాడు. అంత చిరాకు పిల్లలంటే.

పక్కింట్లో పిల్లలున్నారని ముందే తెలిసుంటే ఈ ఇల్లు కొనకపోను. కాని నరసింమూర్తిగారి మనమరాలు ఆ మేడమీద మమకారం పెంచింది. ఆపిల్లని పదేళ్ళ వయస్సప్పుడు చూశాడు. తెల్లగా, సన్నగా, గులాబిరేకులా ఉందాపిల్ల. అల్లరి చేసే ఘటంలా లేదు. దీపాల్లా వెలిగిపోతున్న ఆమె కళ్ళు అతణ్ణి ఆకర్షించి ఉండవచ్చు. అబ్బో, ఇప్పటిమాటా—పదిహేనేళ్ళయింది! ఇప్పుడు ఆపిల్ల తన పొరుగింటిది. ఇప్పుడెలా ఉందో చూడాలి.

ఇల్లు సర్దటం ప్రారంభించాడు ముకుందరావు. వెంకటేశ్వర్లు సాయపడుతున్నాడు. వెంకటేశ్వర్లంటే ఆయనకు వంటచేసి పెట్టేవాడు; ఒక్కొక్కప్పుడు ఆయన అనుంగు మిత్రుడు.

కుర్చీలూ, టేబుళ్ళూ సర్ది గోడకు పటాలు కొడుతూంటే ముకుందరావు "అలా వంకరగా కొట్టి ఏడవకు. రేపుగారి చూస్తే నవ్వుతుంది." అన్నాడు. అని ఆయనే టేబిలెక్కి పటాల్ని జాగ్రత్తగా అమర్చాడు. పటాలంటే ప్రకృతి దృశ్యాలు కావు. అందమైన తారల బొమ్మ లంతకన్నా కావు. చీఫ్ జస్టిస్ ఆఫ్ ఇండియా — ఆయ నెవరో పెద్ద లాయరట, ఇంగ్లీషువాడు, ఆయనదొకటి—వీటన్నిటి కన్న పెద్ద ఫోటో స్వామి శ్రీ వివేకానందుడిది—అంతకన్న కొద్దిగా చిన్నది రామకృష్ణ పరమహంస—ఒక గుమ్మంపైన వెండితోచేసి చెక్క

మీద పొందువరచిన హనుమంతులవారి విగ్రహం— ఇదీ ఆయన డ్రాయింగురూము. హనుమంతుడి బొమ్మ చూస్తే వెంకటే శ్వర్లుకి చచ్చేనవ్వు. వాడికీ పెళ్ళి కాలేదు. ఒకరోజు ముకుంద రావు హుషారుగా ఉండటం చూసి "ఈ బొమ్మని అవతల పారేస్తేనేగాని మనకి పెళ్ళిగాదు.:" అన్నాడు. మండిపడిపో యాడు ముకుందరావు. వెంకటేశ్వర్లు వణికిపోయి "అబ్బెబ్బె, మనకి అంటే "నాకు" అని సమర్ధించుకున్నాడు.

మేడమీద బెడ్‌రూం వక్కన స్టడీరూమ్ ఏర్పాటు చేసుకున్నాడు ముకుందరావు. బీరువాలనిండా పుస్తకాలే. ఇవన్నీ ఎప్పుడు చదివావా అని ఆశ్చర్యం వేస్తుంది ఆయనకు. ఈ బీరువాల మధ్యన, ఈపుస్తకాలమధ్యన, ఒకటేబిల్—దానిముందు ఒకకుర్చీ—ఇక్కడా ఆయన తన 'ఆత్మకథ' మొదలుపెట్టేది.

తన 'ఆత్మకథ' రాసుకోవాలని ఇప్పటికి పదేళ్ళగా ప్రయ త్నిస్తున్నాడు ముకుందరావు. ఇదిగో ఇవాళంట్లూ, రేపంటూ రిటైరై కూచున్నాడు. ఇప్పుడన్నా రాయలేకపోతే జీవితం నుంచే రిటైరై పోతానని భయంపట్టుకుంది. 'ఆత్మకథ' తనకోసం కాదు. అచ్చు వేయించి బజార్లో అమ్మించాలని ఆయన అభిలాష.

రాత్రి వెంకటేశ్వర్లు వంట కమ్మగా భోంచేసి మేడ మీదకు వెళ్ళి అకుర్చీలో కూర్చుని తనకథ మొదలెట్టాడు ముకుందరావు.

వెంటనే ఆయనకు ఓ అనుమానం పట్టుకుంది. కలం ముందుకు కదల్లేదు!

ఎంత వెదికి చూసినా తన జీవితంలో ఒక్కమధుర ఘట్టం కూడ లేదే. మధురఘట్టం లేకుండా ఏ ఆత్మకథేనా ఎలా రాణిస్తుంది?......వారాలు చేసుకుని చదివి లా పాసై, ఉద్యోగం దొరక్క నానా అవస్థలూ పడి అరవై రూపాయలకు ఒక లాయ రు వద్ద కుదిరి నలభై యేళ్ళవరకూ నరకం చూసిన తన కథ ఎలా గుబాళిస్తుంది? నలభై యేళ్ళ పైబడి ఏవో నాలుగు రాళ్ళు సంపాదించాడు. తర్వాత అదృష్టం కలిసొచ్చి జడ్జి అయ్యాడు—అది వేరే సంగతి. కాని తను నరకంలో ఉండగా యవ్వనం తనను చూచి నవ్వింది; వికృతంగా వికటాట్టహా సాలు చేసింది. తనకు స్తోమత కలిగినప్పుడు యవ్వనంమీది కసితో పగతీర్చుకుందా మనుకున్నాడు. కాని వయస్సు మృత్యు దేవతలా అడ్డునిల్చింది. ఆఖరకు ఆయనకు మిగిలింది లోకం మీద కసి!

"నా కథను చదివి ఏ పాఠకుడు సహిస్తాడు! కనుక ఏదో కాస్త కల్పించి రాయాలి. సుందరిని గురించి ఒక ఇరవై పేజీలు రాస్తే బాగుంటుందేమో!"

సుందరి అప్పట్లో తనతోటి లాయరు భార్య. అంద కత్తె కాకపోతే ఆపేరు ఇప్పుడు గుర్తుకు వచ్చేదికాదు. ఆమెను ఒకమాటు చూసింతర్వాత ఐదారేళ్ళు ఆమె రూపమే క్షణ క్షణానికి ఎదుట నిల్చేది.

కలం పక్కన బెట్టి సుందరిని గురించి ఆలోచించటం మొదలెట్టాడు ముకుందరావు. ఏ అర్ధరాత్రో పక్కమీదకు చేరాడు.

తర్వాత వారం రోజులూ ఇలాగే అయింది. 'ఆత్మకథ' కుంటుపడుతుందేమోనని భయంపట్టుకుంది ఆయనకు

ఒకరోజు పొద్దుటే కాఫీతాగి మేడమీద వరండాలో ప్రకృతి అనుభవిస్తున్న ముకుందరావు చెంగున గంతువేశాడు. పక్కింటి గౌరివాళ్ళు వచ్చారల్లేఉంది— ఇల్లు సందడిగా ఉంది. గిన్నెల చప్పుడు వినిపిస్తున్నది. ఆయన మనసు ఆనందంతో నిండింది. వెళ్ళి చూద్దామనుకున్నాడు. కాని ఆపిల్ల గుర్తు పడుతుందో లేదో! అయినా తను జడ్జి. తనంతవాడు ఒక సామాన్యురాలింటికి వెళ్ళడానికి అహం అడ్డొచ్చింది. మధ్యా హ్నం నరసింహమూర్తి రాకపోతాడా, ఆపిల్లా, దాని మొగుడూ తనింటికి రాకపోతారా!

కాని రెండు రోజులయినా నరసింమూర్తి అయిపు లేడు. ఇదివరలో అప్పుడప్పుడు కనుపించేవాడు. మరేం జబ్బో ఈ ఇంట్లోకి వచ్చింతర్వాత మళ్ళీ కనుపించలేదు. పోనీ, కబురుపెడితే—అందుకూ మనసు అంగీకరించలేదు.

ఆరోజు సాయంత్రం మబ్బుగా ఉంది. చల్లటిగాలి వీస్తున్నది. ముకుందరావులో హుషారు పెల్లుబికింది. "మంచి వాతావరణం, ఏమైనా సరే కథ మొదలెట్టాలి." టేబిల్ ముందుకు కుర్చీలాక్కుని చేతులోకి కలం తీసుకున్నాడు.

కెవ్వు మన్నకేక, భోరున ఏడుపూ—గతుక్కుమన్నాడు ముకుందరావు. గబగబ వరండాలోకి వచ్చి వక్కింటి దొడ్లోకి చూశాడు. రెండేళ్ళపిల్ల కెవ్వున ఏడుస్తున్నది: ఐదేళ్ళ కుర్ర వాడు చిన్నకర్రతో దానినెత్తిన కొడుతున్నాడు. అది ఏడుపు ఆపదు. వీడు కొట్టడం మానడు. ఆ ఇంట్లోవాళ్ళు ఏమై పోయారో ఎవరూ బయటకురారు. ఆ గౌరి ఏమై పోయిందో? "దానిల్లు బంగారం కానూ, మూడు రోజులాయె, ఇంతవరకూ కనుపించక పోయె."

ఈ కుర్రకుంకల అల్లర్లతో, ఏడుపులో తన కథ ఎలా సాగుతుందో అర్థం కావడంలేదు ఆయనకు. వీళ్ళను ఒక అదుపులో పెట్టకపోతే లాభంలేదు. అబ్బెబ్బె, పిల్లలా! పిశాచాలా! ఈ పిల్లల్ని పుట్టించిన భగవంతుడంటే వళ్ళు మడింది ఆయనకు.

తిరిగివచ్చి టేబిల్‌ముందు కలంపట్టుకుని కూచున్నాడుకాని ఆ రెండేళ్ళ పిశాచి ఏడుపు ఇంకా వినిపిస్తూనే ఉంది. కుర్రవెధవ కాకిగోల చేస్తున్నాడు. "ఎలా రాసి చచ్చేది?"—విసుగుతో కలాన్ని విసిరి టేబిల్ మీద కొట్టాడు. వెంటనే ఒక ఆలోచన కలిగింది. కలం తీసుకుని చిన్న చీటి రాశాడు.

"గౌరమ్మకు,

నీ పిల్లల్ని కాస్త అదుపులో పెట్టు. ఏదో రాసుకుంటున్నాను. నీ పిల్లల అల్లరి మూలంగా కలం కదల్టంలేదు. మరేమనుకోకు."

ఈ చీటి వెంకటేశ్వర్లుకు ఇచ్చి పంపాడు. ఏం జరుగుతుందో చూదామని వరండాలోకి వచ్చాడు. వెంకటేశ్వరు ఆచీటి ఇవ్వడం మాత్రమే కనుపించింది. వెంకటేశ్వర్లు తిరిగివచ్చిన అయిదు నిముషాలకు గౌరి దొడ్లోకి వచ్చింది. పదిహేనేళ్ళ తర్వాత ఆమెను చూడటం ఇదే ప్రథమం. తనూహించిన గౌరిలా లేదు. బాగా ఎదిగి పోయింది. పచ్చగా, బొద్దుగా దబ్బపండులా ఉంది. ఆమె కేసే కన్నార్పకుండా చూస్తున్నాడు ముకుందరావు.

"అల్లరి చేయకండి నాన్నా, లోపలికి రండి."—మృదుమధురంగా ఉంది ఆమె కంఠం. మాతృత్వంతో మూర్తీభవించి ఉందామె. ముకుందరావు మనసు ఆనందంతో నిండిపోయింది. తనంటే ఎంత గౌరవం !

"పక్కన తాతగారు ఏదో రాసుకుంటున్నారుట—పిల్లలాడుకునేప్పుడే రాసుకోవాలి కాబోలు—లోపలికి పదండి."

ముకుందరావు ముఖంమీద ఎవరో బలంగా గుద్దినట్టయింది. ఈ వాక్యం తన నుద్దేశించే. "హమ్మ—ఎంత పొగరు!"

ఆమె అందం సంగతి మరచి పోయాడు. వళ్లు రవరవ మండిపోయింది. విసురుగా గదిలోకి వచ్చేశాడు.

"ఆమె ఉద్దేశం ఏమిటి?—అసలేమిటంట, ఆమె ఉద్దేశం, అసలేమిటని—హమ్మా—పిల్లలాడుకునేప్పుడే రాసుకుంటున్నానట. హు, నేను రాసుకుంటున్నప్పుడే ఆడుకుని ఏడవాలి కాబోలు! గొంతు పిసికి అవతల పారేస్తేసరి. నేను జడ్జి అనన్నా గౌరవం లేకపోయె—హమ్మా!"

ఆయన చేతులు కోపంతో గజగజలాడి పోతున్నాయి. పిల్లలు ఎంత భయంకర వ్యక్తులో నిరూపిస్తూ తన ఆత్మకథలో రెండు అధ్యాయాలు రాసి పారేయాలని నిశ్చయించుకున్నాడు. కాని ఎంత తన్నుకు చచ్చినా తన చిన్నతనం గుర్తుకు రాలేదు. తను అల్లరి చేసినట్టు అసలు గుర్తుకు రావటం లేదు.

"ఒకవేళ మహా అల్లరి చేసినా, ఇదిగో, ఈ కుర్రకుంకల లాగే చేసుంటాను."

కలం చేతులోకి తీసుకుని గబగబ ఓ ముప్ఫై పేజీలు రాసేశాడు. అక్కడితో తన బాల్యదశను గురించి రాయటం అయింది.

ఆరాత్రి బయట వెన్నెల విరగ గాస్తున్నది. పదకొండైనా ముకుందరావుకు నిద్ర పట్టటం లేదు. ఆ ముప్ఫై పేజీలు కాక మరో ఇరవై పేజీలు రాశాడు అప్పటికి. చేతి వేళ్లు జివ్వున లాగుతున్నాయి. అదీకాక ఎందుకో గబుక్కున సుందరి గుర్తుకొచ్చింది. ఆమె గుర్తుకొచ్చిన రాత్రి పడుకుని తెల్లారి చూసుకుంటే కళ్లు చింతనిప్పుల్లా ఉంటాయి, ఎంచేతనో?

వరండాలోకి వచ్చాడు. పక్కింటి దొడ్లో సిమెంటు సోపామీద ఆ గౌరే గాబోల్ను మొగుడి వళ్లో వాలుంది. ముకుందరావుకు వళ్లు గగుర్పొడిచింది." ఛీ, ఛీ—ఏం పనులు నడిబజార్లో!"—అది నడిబజారు అవునో గాదో అతడికే తెలియాలి.

కాని ఆదంపతుల అలింగనాల్లో అతడి మనసు వెర్రి ఆనందంతో ఉరకలు వేసింది. జీవితంలో ఏదో ముఖ్యమైన వస్తువు కోల్పోయిన వాడిలా బాధపడ్డాడు. వివాహం చేసుకోలేదు కాబట్టి తన గార్హస్థ్య జీవితాన్ని గురించి ఏమని రాసుకుంటాడు తనకథలు? కనీసం తనకథ కోసమైనా వివాహం చేసుకుని ఉండాల్సింది. పాతికేళ్ళకుపైగా తనవద్ద పడున్న హనుమంతులవారి విగ్రహం అంటే చిరాకు కలిగింది. "రేపు నిజంగానే ఆ బొమ్మను అవతల పారెయ్యాలి !"

ఇహ మిగతారాత్రంతా అటువంటి ఆలోచనలే.

మర్రోజు సాయంత్రం కింద బాత్ రూములో స్నానం చేస్తూంటే పూలమొక్కలకు నీళ్లు పోస్తూన్న గౌరి కనుపించింది. బాత్‌రూం పైభాగంలో కట్టిన 'మెష్' లోంచి అవతలి దొడ్డి పూర్తిగా కనుపిస్తుంది. తను ఎవరికీ కనుపించడు. కాళ్లు పైకెత్తి మెడసారించి చూడటం మొదలెట్టాడు. గౌరి ఎంత అందంగా ఉందని!—మేనక, తిలోత్తమ, రంభను గురించి చదివాడేగాని ఈరోజు తన కళ్ళతో తాను చూస్తున్నాడు. అవతల కుర్రవాళ్ళ కేరింతాలు అసలు వినిపించడం లేదు అతడికి. రెండు నిముషాల్లో ఇంట్లోకి వెళ్ళిపోయింది గౌరి.

తువాలు నడ్డికి చుట్టుకుని మేడమెట్లు ఎక్కుతూంటే తను రిటైరైన జడ్జి నన్న సంగతి గుర్తుకొచ్చింది అతడికి. తను చేసింది ఎంత అసహ్యకరమైన పనో తలపువచ్చి సిగ్గుతో కుంచించుకు పోయాడు.

"ఛీ—నాకూ, ఓ కాలేజీ కుర్రాడికి తేడా ఏమిటి?"

ఆరోజు రాత్రి భోజనం చేసి తనకథలోని నాలుగో అధ్యాయం ఇలా మొదలెట్టాడు:

"మూడు అధ్యాయాలు రాసికూడ నాభార్యపేరూ, ఆమెతో నా జీవితం గురించీ రాయటం మరచిపోయాను. చచ్చి ఏలోకాన్న ఉన్నదో కాని ఈనాటికీ నావెన్ను చరిచి నాజీవితాన్ని దిద్దుతూనే ఉన్నది. నాకు వెలుగు చూపిస్తూనే ఉన్నది. అమృతంలాంటి ఆమె మనస్సు, ఈనాటికీ నాకు లోకంమీద తీపిని పెంచుకోవడం నేర్పింది. ఆమెపేరు సుందరి. వెన్నెలలో సిమెంటు సోఫాలమీద, ఆమె నాకు చెప్పిన కథలు ఈనాటికీ నాకు వెలుగుబాటలు. పూల మొక్కల్నిసైతం తన పిల్లలుగా చూచుకునే ఆ వనదేవతని ఇన్ని పేజీలు రాసికూడ ఎలామరచి పోయినానో అని విచారం కలుగుతున్నది............................"

ఈ విధంగా సాగిపోయింది రచన. రాత్రి ఒంటి గంటకు మరో నలభై పేజీలు ముగించి, ఆవులించి పక్కమీదకు చేరాడు ముకుందరావు.

మర్రోజు సాయంత్రం పక్కదొడ్లో ఏడెనిమిది మంది పిల్లలు స్వైర విహారం చేస్తున్నారు. ఒకడు చెట్టెక్కి కొమ్మలు గలగల ఊపేస్తున్నాడు. ఇద్దరు పిల్లలు క్రికెట్ ఆట ఆడుతున్నారు. ఆ రెండేళ్ళపిల్ల కేరింతాలు కొడుతున్నది. ముకుందరావు కోపంతో గజగజలాడి పోతున్నాడు.

ఇంతలో ఆ కుర్రవాళ్లు ఆడుతున్న బంతి ఎగిరి వచ్చి తన దొడ్లో పడింది. బంతికోసం గోలెత్తి పోతున్నారు పిల్లలు. పిట్టగోడ అడ్డుమూలాన ముందు గేటులోంచి తిరిగిరావాలి. వచ్చేందుకు ఈ తాత ఏమంటాడోనని భయం. "బంతి ఇటు పడెయ్యండి" అని కాకిగోల మొదలెట్టాలు.

"చిక్కారు, దొంగవెధవలు!" ముకుందరావు గబగబ మెట్లు దిగివచ్చి దొడ్లోని బంతిని చేతులోకి తీసుకున్నాడు. బంతి చేతిలోకిరాగానే, ఆబంతి పక్కింటి పిల్లల్దనీ, అది వాళ్ళకు ఇచ్చేయాలన్న సంగతీ మరచి పోయాడు. కుర్రతనపు ఉత్సాహం ఆయనలో పెల్లుబికింది. బంతిచేతిలో పుచ్చుకుని చెయ్యి గిర గిర తిప్పటం ప్రారంభించాడు. అవతలి కుర్రవాళ్లు "బంతి, బంతి" అని ఇంకా గోలచేస్తూనే ఉన్నారు. అలా చేయి తిప్పితిప్పి విసురుగా అవతలి దొడ్లోకి విసిరాడు ఆబంతిని. కాని అది అవతలి దొడ్లో పడలేదు. ఎగిరి పక్కింటి కిటికీలకు పైన అందంగా అమర్చిన గాజుఫ్రేముకు తగిలింది. ఫెళ్లుమని గాజుఫ్రేము ముక్కలయింది. కంగారుగా పరుగెత్తుకొచ్చి మేడమీద తనగదిలో దూరాడు ముకుందరావు. గుండె దడదడ కొట్టుకుంటున్నది. గౌరి ఏమంటుందో నన్న భయంతో వణికి పోతున్నాడు. పావుగంటవరకూ ఏప్రమాదమూ జరగలేదు. దిండు వెన్ను కాన్చి నిశ్చింతగా వెనక్కు వాలాడు.

రెండు నిముషాల తర్వాత వెంకటేశ్వర్లు వచ్చి ఎవరో తనకోసం వచ్చారని చెప్పాడు. లోపలకు రమ్మన్నాడు. ఆ వచ్చింది ముప్పై యేళ్ళ యువకుడు. పచ్చగా, నిటారుగా అమెరికన్ సినిమాలో హీరోలా ఉన్నాడు. అతణ్ణి చూచి చిరునవ్వు నవ్వాడు ముకుందరావు. కాని ఆవ్యక్తి నవ్వలేదు.

"మీరేనా ముకుందరావుగారు?" అన అడిగాడు.

"ఔను, ఏం?"

"నేను ఈ పక్కింటిలో ఉంటున్నాను."

"గౌరి భర్తవన్నమాట."

దీనికి సమాధానం చెప్పలేదు ఆవ్యక్తి.

"చూడండి, మొన్న నాభార్యకు, మాపిల్లల అల్లరి విషయమై ఒక చీటీ పంపారు. మాఇంటిలో మాకు స్వేచ్ఛ లేకుండా చేసేందుకు మీకు అధికారం లేదు. కాని ఆరోజున సహించాను. ఇవాళ నేను ఫలహారం చేస్తూంటే కిటికీ గాజు పెంకులు విరిగి నా ప్లేటులో పడినై. ఇది మీ రెండో తప్పిదం. మీరు నాకంటె వయస్సులో పెద్దవారు. పైగా జడ్జీగారట. ఈరెండూ కాని పక్షంలో ఏం చేసేవాణ్ణో మీరూహించి ఉండరు." పిడికిలి బిగించి పళ్లు పటపట కొరుకుతున్న ఆవ్యక్తిని చూసి వణికి పోయాడు ముకుందరావు.

"ఇక మీదటన్నా మావిషయంలో జోక్యం కలుగజేసుకోకండి." సమాధానం ఆశించకుండా గిరుక్కున తిరిగి వెళ్ళి పోయాడు ఆవ్యక్తి.

కుర్చీలో కూలబడిపోయాడు ముకుందరావు. అతడికి నోటంట మాట రావటంలేదు. వెంకటేశ్వర్లును కేకేద్దామనుకున్నాడుకాని మాటలు పెగలటంలేదు. ఆ వచ్చిన వ్యక్తిని నమిలి మింగేయాలన్నంత కోపంగా ఉంది.

ఆరోజు శనివారం కావటం మూలాన వెంకటేశ్వర్లు ఏదో ఫలహారం చేశాడు. తను కొద్దిగా తిని మిగతాది పక్కింట్లో ఇచ్చిరమ్మని పంపాడు. పక్కింటివాళ్లు అది నిరాకరించలేదు.

రాత్రి తన కథలో ఆరో అధ్యాయం మొదలెట్టాడు ముకుందరావు.

"వయస్సులో నేను చాల అందంగా ఉండేవాణ్ణి. పచ్చగా, నిటారుగా, అమెరికన్ సినిమాలో హీరోలా ఉండేవాణ్ణి. అందంగా ఉన్నా ఎప్పుడూ కస్సుబుస్సుమంటూండేవాణ్ణి. ఇంత చిరాక నాలో ఎందుకు కలిగించాడా, అని మనస్సులో భగవంతుణ్ణి నిందించుకుంటున్నాను..............................." ఇలా సాగి పోయింది రచన.

ఇరవై రోజుల తర్వాత ఓ మాటు నరసింమూర్తి వచ్చాడు ఇన్నాళ్లూ కనుపించక పోయిన అతణ్ణి చూసి ముక్కుమీద గుద్దేయాలన్నంత కోపంవచ్చింది. కాని నరసింమూర్తి తనకు ఊపిరాడనంత కబుర్లతో ముంచెత్తడంతో కోపం ఇట్టే ఎగిరి పోయింది. గౌరి తనింట్లో కాఫీచేసి ఇద్దరికీ పట్టుకువచ్చింది. తనింట్లో అడుగుపెట్టిన గౌరిని చూసేప్పటికి అతడి మనసులో వేయిదీపాలు వెలిగినాయి.

"గౌరి మొగుడు మహాకోపిష్ఠోయ్ నరసింమూర్తీ" అన్నాడు కాఫీ చప్పరిస్తూ ముకుందరావు. కాని గౌరికేసి చూస్తూ ఏమీ మాట్లాడ లేకపోయాడు.

గౌరి వెళ్ళిపోయింతర్వాత తన ఆత్మకథను గురించి నరసింమూర్తికి చెప్పి రాసినంతవరకూ చదివి అభిప్రాయం చెప్పమని ఇచ్చాడు. ఆయనది చదివేందుకు రెండు గంటలు పట్టింది.

అంతా చదివి నరసింమూర్తి మహదానందంతో ముకుందరావుని ఆలింగనం చేసుకున్నాడు.

"చాల గొప్పగా రాశావోయ్. నేను తెలుగులో చాలా కావ్యాలు చదివానుకాని ఇంత గొప్ప కథ నేనింతవరకూ చదవలేదు. నీ చిన్నతనం, నీ వివాహజీవితం నాకళ్ళకు కట్టినట్లుగా ఉంది—సరేకాని, నీకు వివాహం అయిందనీ, నీభార్య పోయిందనీ నాకింతవరకూ చెప్పలేదేం? అయితే నీకు పిల్లలు లేరా?" అన్నాడు నరసింమూర్తి.

ముకుందరావు సిగ్గుతో తలవంచుకున్నాడు.

"ఒకడు పుట్టి వెంటనే పోయాడు." అన్నాడు సన్నగా. ఇన్ని అబద్ధాలు ఎందుకు చెబుతున్నాడో అతడికి అర్థం కావడంలేదు.

"మిగతాదికూడ త్వరగా పూర్తి చేసేయ్." అన్నాడు నరసింమూర్తి.

తర్వాత, తను బెంగుళూరు వెడుతున్నాననీ, మూడు నాలుగు నెలలు ఉంటాననీ, ముకుందరావుని కూడ తనతో రమ్మనీ కోరాడు నరసింమూర్తి. ముకుందరావు వెంటనే అంగీకరించాడు.

మూడు రోజుల తర్వాత ఇల్లు వెంకటేశ్వర్లకి అప్పచెప్పి బెంగళూరు బయలు దేరాడు ముకుందరావు.

*　　*　　*

బెంగుళూరులో నాలుగు నెలలూ, హుషారుగా గడిచి పోయినాయి. స్నేహితులూ, క్లబ్బులూ, 'కింగ్ ఆఫ్ కింగ్స్' ఓల్డ్‌స్కాచ్ విస్కీలూ—ఈలోకాన్నీ, తన 'ఆత్మకథ' నూ మరచిపోయాడు ముకుందరావు.

*　　*　　*　　*

నూతనోత్సాహంతో తన ఊరు తిరిగివస్తూన్న ముకుందరావు తన కథను మరింత గొప్పగా రాయాలని ఉత్సాహపడుతున్నాడు. గౌరిని చూడాలని అతడి మనసు ఆరాటపడుతున్నది.

భోంచేసి కాసేపు విశ్రమించి సాయంత్రం వరండాలోకి వెళ్ళాడు ముకుందరావు. ఏదైనా పిల్లలు ఆడుకునేందుకు దొడ్లోకి రాలేదు. అరైంది. ఆరున్నరైంది. పిల్లలు ఏమైపోయారో!

రాత్రి ఏడైనా పక్కింట్లో లైట్లు వెలగలేదు. వాళ్ళేమైపోయారు! కంగారుగా వెంకటేశ్వర్లని కేకేశాడు. వెంకటేశ్వర్లు వచ్చి చెప్పిన కథ అతణ్ణి శూలాలా గుచ్చింది.

"నెలరోజుల క్రితం ఆ పక్కింట్లోని భార్యాభర్తలు దెబ్బలాడుకున్నారట. అతడికి మరో అమ్మాయితో సంబంధం ఉన్నట్లు గౌరికి అనుమానంట. ఆ విషయమై ఘర్షణపడి ఆమె తన పుట్టింటికి వెళ్ళిందట—అంటే ఆ ఊళ్ళోనే ఉన్న నరసింమూర్తి గారింటికి. ఇప్పుడు ఆమెభర్త ఒక్కడే ఈ ఇంట్లో ఉంటున్నది. ఎక్కడో నాలుగు మెతుకులు కతికి, ఆ కొత్త అమ్మాయితో కులికి రాత్రి ఏ పదకొండింటికో ఇల్లు చేరతాడట."

ఈ కథ విన్న ముకుందరావుకు మనసు మనసులో లేదు. నాలుగునెలల ప్రశాంత జీవనంలో తెచ్చుకున్న నూతనోత్సాహం అంతా కరిగిపోయింది. గౌరి లాంటి భార్య ఉండగా ఈ కుర్రవాడికి ఇదేం తెగులు? సరే, ఎవరెలా పోతేనేం అని మనసుకు సమాధానం చెప్పుకున్నాడు.

రాత్రి తన కథ పునఃప్రారంభించేందుకు నానా అవస్థలూ పడ్డాడు. ఎంత ప్రయత్నించినా కలం కదలడం లేదు. గౌరి ఎంత బాధపడుతున్నదో నని ఊహించుకుని దిగులు పెంచుకున్నాడు. తండ్రిలేని ఆపిల్లలు గతి ఏమిటి?

ఆ రాత్రంతా కలత నిద్ర పోయాడు ముకుందరావు.

తర్వాత వారంరోజులూ ఇలాగే గడిచిపోయింది. ఎంత ప్రయత్నించినా తనకథ అంగుళం కదల్లేదు. ఆవారం రోజుల్లోనూ గౌరిభర్త తనకు కనుపించలేదు. ఎప్పుడు వెడుతున్నాడో, ఎప్పుడు ఇంటికి చేరుతున్నాడో!

ఒకరోజు పొద్దుటే నిద్రలేచి డ్రెస్ చేసుకుని నేరుగా నరసింమూర్తి గారింటికి బయలుదేరాడు ముకుందరావు. అప్పటికి నరసింమూర్తి ఇంట్లోలేడు. గౌరికోసం అడిగాడు.

తన ఎదురుగా నిలబడ్డ గౌరిని చూసి తొట్రుపడ్డాడు ముకుందరావు. ఏం మాట్లాడాలో తోచటంలేదు.

"పిల్ల లేరీ?" అనడిగాడు.

ఆ ఐదేళ్ళ కుర్రవాడు తల్లివెనకనుంచి ఇవతలకు వచ్చాడు. తను తెచ్చిన చాక్‌లేట్ల డబ్బా ఆకుర్రవాడి చేతిలోపెట్టి "ఏవో కీచులాటలొస్తే ఇల్లే వదిలేసుకుంటారా గౌరమ్మా?" అన్నాడు.

గౌరి ముఖం వెలవెల బోయింది. ముకుందరావు ఆమెకు మళ్ళీ ఏవో బాధాకరమైన విషయాలు గుర్తు చేస్తున్నట్టు బాధపడుతూ:

"అది నీయిల్లు. నిన్ను ఆయింట్లోంచి పంపేందుకు అతడికి అధికారం లేదు. కావలిస్తే అతణ్ణే వెళ్ళిపొమ్మను." అన్నాడు.

"ఈ సంగతులు మీకు అనవసరం అంటే మీరు బాధపడరుగా తాతగారూ." అంది గౌరి నీరసంగా.

"నాపక్కింటి మంచిచెడ్డలు, నీకెంత అవసరమో, నాకూ అంత అవసరమే. మీ పోట్లాటవల్ల నాకథ రాసుకోలేక పోతున్నాను." అన్నాడు.

"అందుకూ నేను బాధ్యురాలినేనా?" అన్నది గౌరి.

దీనికి సమాధానం చెప్పలేదు ముకుందరావు. ఆకుర్రవాణ్ణి ఎత్తుకుని,

"మీ అమ్మంత మొండి ఘటాన్నీ, మీనాన్నంత కోపిష్ఠినీ నేనెక్కడా చూళ్లేదు. వీళ్ళతో నీకెందుకూ నాతో వచ్చెయ్. బోలెడు చాక్లెట్లిస్తా." అన్నాడు.

కుర్రవాడు ఊహు రా నన్నాడు.

"మానాన్నవు కదూ" అని బతిమాలాడు ముకుందరావు.

నరసింమూర్తి వచ్చింతర్వాత అతడితో ఓగంట సేపు గౌరి విషయం చర్చించి, గౌరికి తనూ నరసింమూర్తిలాటి వాడినేననీ, తనయిల్లు ఆమెకు పరాయిదికాదనీ, తనతో వచ్చి ఉండమనీ ప్రాధేయపడ్డాడు ముకుందరావు.

ఆరోజంతా ఆలోచించుకున్న గౌరి మర్రోజు పిల్లలతో సహా ముకుందరావు ఇంటికి వచ్చేసింది.

ఆమె తనింట్లో అడుగు పెట్టటంతో తనగృహం పావనం అయినట్టు ఆనందపడిపోయాడు ముకుందరావు. ఆమె వచ్చిందో లేదో, వెంకటేశ్వర్లని వంట చేయనివ్వడంలేదు. అన్నీ తనే స్వయంగా చేస్తున్నది. అటువంటి భోజనం ముకుందరావు రుచి చూసి ఎరగడు. పిల్లలు నిమిషనిమిషానికీ పైకొచ్చి "తాతా, ఇదేమిటి, అదేమిటి?" అని ఇల్లు నానా అల్ల కల్లోలం చేస్తున్నారు. టమటమాల బండి ఇంట్లో స్వేచ్ఛగా తిరుగుతున్నది. గౌరి ఒక్కోప్పుడు కింద బాత్ రూంలోకి వెళ్ళి గంటల తరబడి ఇవతలకి వచ్చేదికాదు. ఆమె బాత్‌రూంలోకి వెళ్ళినప్పుడు తను పైన వరండాలో నిలబడి పక్కింటి వేపు చూసేవాడు. గౌరిభర్త కనుపించేవాడు కాదు. నిరాశతో గౌరి ఇవతలకు వచ్చేది. తనూ అలాగే ఫీలయ్యేవాడు.

ఈ సమస్యకు పరిష్కారం ఎప్పుడో అతడికి అర్థం కావటంలేదు. తనకథకు ఈ సమస్య ఒక అడ్డుగోడై నిలచింది. ఏమి రాద్దామన్నా చేతులు నిర్జీవంగా ఉన్నాయి. పిల్లలకేకలు ఆయనకు చిరాకు కలిగిస్తున్నాయి. ఏమీ రాసుకోలేక పోతున్నాడు.

ఒకరోజు సాయంత్రం పెందరాళే ఆమెభర్త ఇంటికి రావడం గమనించాడు ముకుందరావు. గబగబ గౌరిని టాయిలెట్ కమ్మనీ, పిల్లల్ని బజారుకు వెళ్ళేందుకు తయారు చేయమనీ పురమాయించి తనూ డ్రెస్ చేసుకున్నాడు. వీళ్ళని తీసుకొని పక్కింటి ముందుగా నడిచి వెడుతున్నాడు ముకుందరావు. అదేసమయంలో గౌరిభర్త వరండాలో నిలబడి వీళ్ళను చూస్తున్నాడు. గౌరి అటుకేసి ముఖం తిప్పలేదు. ముకుందరావు సరదాగా ఆమెతో కబుర్లు చెపుతున్నాడు. తనచేతిలో వున్న రెండేళ్ళపిల్ల అతణ్ణి కావలించుకుని భుజం మీద పడుకుని వున్నది. అలాఅలా తిరిగి రాత్రి ఎనిమిది గంటలకు ఇంటికొచ్చారు. అప్పటికీ పక్కింట్లో లైటు వెలుగుతూనే వున్నది.

ఈ కార్యక్రమం క్రమేపీ అలవాటయి పోయింది. సాయంత్రం అయేటప్పటికి కుర్రవాడు "తాతా బజారుకు" అనడం తను బయలు దేరడం, గౌరి అనుసరించడం మామూలు అయిపోయింది.

ఇప్పుడు గౌరిభర్త ఎక్కడకు కదలడం లేదల్లే వుంది. తాము షికారు వెడుతున్నప్పుడు వరండాలో నిలబడి తమకేసి చూస్తూండేవాడు.

ఒకరోజు తనింటి గేటువద్ద వెంకటేశ్వర్లతో అతను ఏదో మాట్లాడుతూండటం గమనించాడు ముకుందరావు. అతను ఏం మాట్లాడాడో వెంకటేశ్వర్లని పిలిచి అడగలేదు. సమాధానం ఆయనకు తెలుసు.

ఇలాగే మరో వారం రోజులు గడిచింది. తన కథ ఏ మాత్రం ముందుకు సాగడం లేదు.

ఒకరోజు తన స్వంతపనిమీద బజారుకు వెళ్ళి రాత్రి పది గంటలకు తిరిగివచ్చాడు. తను ముందు హాల్లోకి అడుగెట్టేసరికి గౌరితో ఆమెభర్త మాట్లాడు తున్నాడు. ఇప్పుడు ముకుందరావుకు మంచి అదను దొరికింది.

"నేను లేకుండా నాయింట్లోకి ఎందుకు ప్రవేశించావు?"

ఈ సూటి ప్రశ్నకు బిక్కమొహం వేశాడు గౌరిభర్త.

"నాభార్య......." అని నీళ్ళు నములుతూన్న అతనితో "నీవు ఆమెభర్త వని నాకు తెలీదే......" అని ఇంకా ఏదో అనబోయాడు ముకుందరావు.

గౌరిభర్త చివాలున కుర్చీలోంచి లేచి విసురుగా బయటకు వెళ్ళిపోయాడు. అతడు వెళ్ళిన ఒక క్షణానికి "ఏం నాభర్తతో మాట్లాడుకునే అధికారంకూడ నాకు లేదా?" అంది గౌరి.

ఈప్రశ్నకు సమాధానం చెప్పకుండా గబగబ మేడ మీదికి వెళ్ళిపోయాడు ముకుందరావు.

మర్రోజు నిద్రలేచి కాఫీకోసం కేకవేస్తే వెంకటేశ్వర్లు కాఫీ పట్టుకువచ్చాడు. "గౌరి ఏమైంది?" అంటే, "తనింటికి వెళ్ళి పోయింది" అని సమాధానం చెప్పాడు వెంకటేశ్వర్లు.

తృప్తిగా నిట్టూర్చాడు ముకుందరావు.

ఆరోజు సాయంత్రం పక్కింటి దొడ్లోంచి పిల్లల కోలాహలం తన చెవులకు సంగీతంలా వినిపించింది. ఆరాత్రి వెన్నెల్లో గౌరి, ఆమెభర్త ఒళ్ళో వాలింది. ముకుందరావు మనస్సు ఉల్లాసంగా ఊగిసలాడింది.

అప్పటి కప్పుడే కలం చేతిలోకి తీసుకున్నాడు. టైము చూసుకున్నాడో లేదో కాని, కలం మాత్రం చకచక సాగిపోయింది.